సాక్షి
కామారెడ్డి
ఆదివారం । 9 । జూన్ । 2024





## లోక్ అదాలత్ విజయవంతం

జిల్లాలోని కోర్టులలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. 3,819 కేసులను పరిష్కరించారు.

- 9లో ▸



## గురుకులంతో సౌలభ్యం

గురుకుల పాఠశాలలతో పేద విద్యార్థులకు మేలు జరిగిందని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
40.0 /23.2

## వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. అక్కడక్కడ ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

---

### న్యూస్‌రీల్

## సోయా విత్తనాల కోసం మహారాష్ట్రకు పరుగులు




**మద్నూర్:** రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సోయా విత్తనాల పంపిణీ బంద్ చేయడంతో మండల రైతులు పొరుగున ఉన్న దెగ్లూర్‌కు వెళ్లాల్సి వస్తోంది. అక్కడినుంచి విత్తనాలను తెచ్చుకుంటున్నారు. ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం వరకు సోయా విత్తనాలను సబ్సిడీపై అందించేది. ఆ తర్వాత పంపిణీని నిలిపి వేయడంతో రైతులు సరిహద్దులో ఉన్న కర్ణాటక, మహారాష్ట్రలకు వెళ్తున్నారు. సోయా విత్తనాల 25 కిలోల బస్తా ధర రూ. 3 వేల నుంచి రూ. 4,500 వరకు ఉందని రైతులు పేర్కొంటున్నారు. అది కూడా ఎరువులు కొనుగోలు చేస్తేనే విత్తనాలు ఇస్తున్నారంటున్నారు. స్థానికంగా విత్తనాలు లభించకపోవడంతో వారి వద్దే విత్తనాలతోపాటు ఎరువులను కొనుగోలు చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సోయాబీన్ విత్తనాలు సరఫరా చేయాలని కోరుతున్నారు.

## 11లోగా యూనిఫామ్‌లు అందించాలి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్



**కామారెడ్డి క్రైం:** యూనిఫామ్‌లను సిద్ధం చేసి ఈనెల 11 వ తేదీలోగా ఎంఈవోలకు అందించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. శనివారం ఆయన కామారెడ్డి మండలం గర్గుల్‌లో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం కుడుతున్న యూనిఫాంలను పరిశీలించారు. ఈ సందర్భంగా యూనిఫామ్‌లు కుడుతున్న మహిళా సంఘాల సభ్యులకు పలు సూచనలు చేశారు. ఏడాది పాటు మన్నికతో ఉండేలా కుట్టాలని సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధి కోసం విద్యార్థుల ఏకరూప దుస్తులు కుట్టే బాధ్యతను మహిళా సంఘాలకు అందించిందన్నారు. జిల్లాలో 128 కేంద్రాలలో 1,979 మంది మహిళా సంఘాల సభ్యులతో 77,889 దుస్తులను కుట్టిస్తున్నామన్నారు. మన్నికగా ఉండేలా కుడితే వచ్చే ఏడాది కూడా దుస్తులు కుట్టే బాధ్యతను మీకే అప్పగిస్తామన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో ఏపీడీ మురళీకృష్ణ, ఐకేపీ ఏపీఎంలు సుధాకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# పెంచుకున్న బంధం



ఆవులతో మాచారెడ్డికి చెందిన రాజమౌళి గుప్తా

- మూగజీవాలంటే వారికెంతో ఇష్టం
- ఆవులు, శునకాలు, పిల్లులపై ఎనలేని ప్రేమ
- కుటుంబ సభ్యుల్లా చూసుకుంటున్న పలువురు

సండే స్పెషల్

**సాక్షి, కామారెడ్డి:** మూగ జీవాలంటే వారికి మక్కువ ఎక్కువ. వాటిని తమ కుటుంబ సభ్యుల్లా చూసుకుంటారు. పొద్దున లేచింది మొదలు రాత్రి పడుకునే దాకా వాటి ఆలనా, పాలనా చూస్తారు. ఆ మూగజీవికి ఏదైనా ఆపద వస్తే తల్లడిల్లిపోతారు. వాటికి వైద్యం చేయించి కాపాడుకుంటారు. జరగరానిది జరిగితే తీవ్ర వేదనకు గురవుతారు.

కామారెడ్డి పట్టణంలోని సీఎస్ఐ కాలనీలో నివసించే రిటైర్డ్ ఎంఈవో విజయలక్ష్మి పెంపుడు శునకం అనారోగ్యంతో చనిపోతే.. ఇంటి పెరడులో పూడ్చిపెట్టి దానికి సమాధి నిర్మించారు. ఆ శునకంతో అనుబంధం అలా పెంచుకున్నారు. ఇలా ఎంతో మంది మూగజీవులను ప్రేమిస్తూ వాటికి సేవ చేస్తున్నారు. ఏళ్లుగా గోవులు, కుక్కలు, ఇతర జీవులను పెంచుకుంటున్న వారిపై సండే స్పెషల్ కథనం..

### గోసేవలో..



ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన ఓర విఠల్ కుటుంబం చాలా కాలంగా గోవులను పెంచుతోంది. తాతల కాలం నుంచి తమ కుటుంబంలో గోవులు భాగమయ్యాయని వారు పేర్కొంటున్నారు. ఆవులకు రోజూ పూజలు చేస్తామని తెలిపారు.

### ఆవులపై మక్కువతో...



ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన ముత్యాల కృష్ణప్రియ సురేందర్ దంపతులు కొన్నేళ్లుగా ఆవులను పెంచుతున్నారు. వాటికి గ్రాసం అందించడంతోపాటు రోజూ పూజలు చేయడం ద్వారా సంతృప్తి పొందుతున్నారు. ఆవులు తమ జీవనంలో భాగమయ్యాయని పేర్కొన్నారు. వాటికి సేవచేస్తూ ఆనందం పొందుతున్నామని పేర్కొంటున్నారు.

### ఆరు దశాబ్దాలుగా...

రాజంపేట మండల కేంద్రానికి చెందిన గౌరీనాథ్ శర్మ ఆరు దశాబ్దాలుగా ఆవులను పోషిస్తున్నారు. తమ కుటుంబంలో మూడు తరాల వారికి గోవులతో అనుబంధం ఉందని గౌరీనాథ్ శర్మ తెలిపారు. గోవును లక్ష్మీదేవిగా భావించి రోజూ ఉదయం పూజలు చేస్తామన్నారు. ఒక్కోరోజు ఒక్కో రకం ధాన్యాన్ని అందిస్తామని తెలిపారు. ప్రస్తుతం ఐదు ఆవులు ఉన్నాయన్నారు.



### గోవులను పెంచుతూ.. రైతులకు పంచుతూ..



మాచారెడ్డి మండల కేంద్రానికి చెందిన వ్యాపారి శెనిశెట్టి రాజమౌళి గుప్తా గోసేవలో తరిస్తున్నారు. ఆయన తన ఇంటి వద్ద ఆవుల కోసం ప్రత్యేక షెడ్డు ఏర్పాటు చేశారు. వాటిని పోషిస్తూ రైతులకూ అండగా ఉంటున్నారు. ఎవరైనా ఆవును పెంచుకుంటానని అడిగితే గోదానం చేస్తున్నారు. ఇప్పటివరకు ఆయన వేయికిపైగా ఆవులను దానం చేశారు. ఆవులను ఎవరికీ అమ్మబోమనే హామీ పత్రం తీసుకుని ఇస్తారు. గో సంతతి అంతరించి పోకుండా చూడాలన్న, వృద్ధి చేయాలన్న సంకల్పంతోనే గోదానం చేస్తున్నానని రాజమౌళి గుప్తా చెబుతారు.

### మూడు తరాలుగా..



నస్రుల్లాబాద్ మండల కేంద్రానికి చెందిన కూని సాయాగౌడ్ కుటుంబం మూడు తరాలుగా శునకాలను పెంచుకుంటోంది. ప్రస్తుతం వారి వద్ద డాబర్ మ్యాన్ డాగ్ ఉంది. శునకం కుటుంబంలో ఒక సభ్యుడిగా మారిపోయిందని సాయా గౌడ్ తెలిపారు. వేసవిలో ఎండ వేడికి తట్టుకోలేదని, ఏసీ ఉండాల్సిందేనని పేర్కొన్నారు.

### ఒత్తిడి దూరమవుతుంది...



ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన న్యాయవాది నాగం సాయి బాబా లాబ్రడార్ కుక్కను పెంచుకుంటున్నారు. దానికి అర్జున్ అని పేరు పెట్టుకున్నారు. అర్జున్ ఎంతో ప్రేమగా, స్నేహపూర్వకంగా ఉంటుందని సాయిబాబా తెలిపారు. ఆ కుక్కను చూడగానే ఒత్తిడి దూరమవుతుందని, ప్రశాంతత చేకూరుతుందని పేర్కొన్నారు.

### డాలీ అంటే బామ్మకు ఎనలేని ప్రేమ

ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన బాగిర్తిబాయి డాలీ అనే శునకాన్ని పెంచుతోంది. డాలీ అంటే బామ్మకు, బామ్మ అంటే డాలీకి ఎంతో ఇష్టం. తాను ఏదైనా ఊరెళ్తే ఎప్పుడు వస్తానోనని డాలీ ఎదురు చూస్తుంటుందని బాగిర్తిబాయి తెలిపింది. ఇంటికి చేరగానే పరుగున వచ్చి గారాలు పోతుందని పేర్కొంది.



## నేడు గ్రూప్–1 పరీక్ష

- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ జితేష్ వి పాటిల్
- పకడ్బందీగా నిర్వహించాలని సిబ్బందికి సూచన



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

**కామారెడ్డి క్రైం:** టీజీపీఎస్సీ ద్వారా నిర్వహించనున్న గ్రూప్–1 పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. శనివారం పట్టణంలోని ఆర్‌కే డిగ్రీ కళాశాలలో పరీక్షకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు, ఇన్విజిలేటర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో 4,797 మంది గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష రాయనున్నారన్నారు. వీరికోసం 12 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఆదివారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఉదయం 9 గంటలనుంచి 10 గంటల వరకు మాత్రమే కేంద్రంలోనికి అనుమతి ఇస్తామని పేర్కొన్నారు. 10 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా లోనికి అనుమతి లేదని స్పష్టం చేశారు. అభ్యర్థులు పరీక్ష హాల్‌కు హాల్ టికెట్‌తో పాటు ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్, పాన్ కార్డ్, ఓటరు ఐడీ లేదా మరేదైనా ప్రభుత్వ ఫొటో గుర్తింపు కార్డులలో ఏదైనా ఒకదానిని వెంట తీసుకుని రావాలని సూచించారు. కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్‌లకు మాత్రమే ఫోన్‌లు అనుమతిస్తారన్నారు. అభ్యర్థులు బూట్లు, సాక్స్‌లు వేసుకుని రావద్దన్నారు. పరీక్ష సమయం పూర్తయ్యేంతవరకు పరీక్ష కేంద్రంనుంచి బయటికి వెళ్లడానికి అనుమతించబోమన్నారు.

## కానిస్టేబుళ్ల బదిలీ

- జిల్లాలో 69 మందికి స్థానచలనం
- ఉత్తర్వులు జారీ చేసిన ఎస్పీ సింధు శర్మ

**కామారెడ్డి క్రైం:** సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాలో 69 మంది కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ ఎస్పీ సింధు శర్మ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఒకేచోట ఐదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్నవారికి స్థాన చలనం కలిగించారు. సీనియారిటీ, ఆరోగ్య కారణాలరీత్యా బదిలీలు కోరుతూ వచ్చిన దరఖాస్తులను దృష్టిలో పెట్టుకుని జిల్లా పరిధిలో కోరుకున్న పోలీస్ స్టేషన్లకు బదిలీ చేశామని ఎస్పీ ఒక ప్రకటనలో తెలిపారు. బదిలీ అయినవారు సంబంధిత పోలీస్ స్టేషన్‌లలో వెంటనే రిపోర్ట్ చేయాలని సూచించారు.

---

## అభివృద్ధి కోసం 'శంఖారావం'

- నేడు కామారెడ్డి పట్టణ ప్రజలతో భేటీ కానున్న ఎమ్మెల్యే కేవీఆర్
- 7 వేల మందికి ఆహ్వానం

**కామారెడ్డి టౌన్:** అసెంబ్లీ ఎన్నికల సమయంలో సొంత మేనిఫెస్టోతో ప్రజల ముందుకు వచ్చి, వారి ఆదరాభిమానాలు చూరగొన్న కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి.. అభివృద్ధి కోసం మరో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కామారెడ్డి పట్టణ అభివృద్ధి కోసం వివిధ వర్గాల సలహాలు, సూచనలు స్వీకరించేందుకు 'శంఖారావం' పేరుతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని రాజారెడ్డి గార్డెన్‌లో నిర్వహించే ఈ సమావేశంలో పాల్గొనాల్సిందిగా పట్టణానికి చెందిన సుమారు 7 వేల మందిని ఆహ్వానించారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభం కానుంది.

**మూడు వారాలుగా..**

శంఖారావం సమావేశం కోసం ఎమ్మెల్యే కేవీఆర్, బీజేపీ నేతలు సుమారు మూడు వారాలుగా శ్రమిస్తున్నారు. కుల, యువజన, సిండికెట్లు, వ్యాపార అసోసియేషన్లు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు.. ఇలా చాలా మందికి ఆహ్వాన పత్రికలను అందించారు. సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేశారు. పలువురి సెల్‌ఫోన్‌లకు వ్యక్తిగత మెస్సేజ్‌లు పంపించారు. వాయిస్ కాల్స్ ద్వారా సమాచారం ఇచ్చారు. పట్టణ అభివృద్ధి కోసం, సమస్యల పరిష్కారం కోసం చర్చించేందుకు నిర్వహిస్తున్న సమావేశానికి పుర ప్రజలు తరలిరావాలని ఎమ్మెల్యే కేవీఆర్ కోరారు. పట్టణ అభివృద్ధిపై ప్రజలు ఇచ్చే సలహాలు, సూచనలు, ఆలోచనలను స్వీకరించి, వాటిని నెరవేర్చడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

# పంట మార్పిడితో సత్ఫలితాలు

రైతులు ఏటా వరి పంటను మాత్రమే సాగు చేయడంకంటే అప్పుడప్పుడు పంట మార్పిడి చేయడం ద్వారా మంచి ఫలితాలను సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి సూచించారు. పంట మార్పిడితో అధిక దిగుబడులు వచ్చే అవకాశాలుంటాయన్నారు. నీటి వసతి ఉంటే నారు పోసుకోవడానికి ఇది సరైన సమయమన్నారు. సన్న రకాల ధాన్యానికి బోనస్ ఇచ్చే అంశంపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో 'సాక్షి' శనివారం జిల్లా వ్యవసాయ అధికారితో ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించింది. రైతులు ఫోన్ చేసి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. విత్తనాల ఎంపిక, వివిధ రకాల పంటలను సాగు చేయడానికి అనువైన సమయం, ఎరువుల వాడకం, చీడ పీడల నివారణ తదితర అంశాలపై డీఏవో సలహాలు, సూచనలు ఇచ్చారు. ఆ వివరాలు..

– కామారెడ్డి క్రైం/కామారెడి టౌన్




సాక్షి ఫోన్ ఇన్

- నీరుంటే నారు పోసుకోండి
- ఏ కంపెనీ ఎరువైనా ఒకేలా పని చేస్తుంది
- బోనస్‌పై స్పష్టత రాలేదు
- 'సాక్షి' ఫోన్‌ఇన్‌లో డీఏవో భాగ్యలక్ష్మి

**ప్రశ్న:** సోయాబీన్, పత్తి, మక్కపంటలు వేయాలనుకుంటున్నాను. నల్లరేగడి భూమికి ఏ రకం విత్తనాలు వాడాలి?

– కొడిగుడ్ల శంకర్, బేగంపూర్, పెద్దకొడప్‌గల్

**డీఏవో:** సోయాబీన్‌లో ఇక్కడి భూములకు బాసర రకం విత్తనాలు అనుకూలంగా ఉంటాయి. వాటితో మంచి దిగుబడులు వస్తాయి. పత్తిలో బీజీ-2 రకాలు వేసుకోవాలి. యూఎస్-4078, ఆర్‌సీఎస్-659, లోటస్ రకాలకు ఎక్కువ డిమాండ్ ఉంది. దొరకని విత్తనాల కోసం ప్రయత్నించడం కంటే అందుబాటులో ఉన్న ఏ రకం బీజీ- 2 విత్తనాలు అయినా వాడుకోవచ్చు. ఒకే రకమైన ఫలితాలు ఉంటాయి. మక్కలో కంచన్ హైబ్రీడ్ రకాలు బాగుంటాయి.

**ప్రశ్న:** సేంద్రియ ఎరువులతో ఉపయోగాలు?

– మల్లప్ప పటేల్, కాటేపల్లి, పెద్దకొడప్‌గల్

**డీఏవో:** ఎకరానికి 10 టన్నుల సేంద్రియ ఎరువులు వేసుకోవాలి. ఇలా చేస్తే భూమికి నీటిని పట్టుకుని ఉండే తత్వం, భూసారం పెరుగుతాయి. వర్మి కంపోస్టు వాడుకోవాలి. బాగా చివికిన ఎరువును వాడితే కలుపు సమస్యలు ఉండవు.

**ప్రశ్న:** సన్న వడ్లు ఏ రకం వేసుకుంటే ప్రభుత్వం అందించే బోనస్, అధిక దిగుబడులు వస్తాయి?

– అంజనేయులు, భిక్కనూరు

**డీఏవో:** సన్నాలకు ప్రభుత్వం ఇచ్చే బోనస్ విషయంలో ఇంకా ఎలాంటి ఉత్తర్వులు రాలేవు. మంచి దిగుబడుల కోసం తెలంగాణ సోనా, బీపీటీ-5204, ఆర్ఎస్ఎన్ -15048 రకాలను వేసుకోవచ్చు.

**ప్రశ్న:** నారుమడిని ఎంత శుభ్రం చేసినా వరిని మొగి పురుగు ఎక్కువగా ఆశిస్తోంది. ఎలాంటి చర్యలు తీసుకోవాలి?

– నడిపోళ్ల అంజయ్య, పెద్దకొడప్‌గల్

**డీఏవో :** నారుమడితో పాటు చుట్టూ ఉండే గట్లను కూడా శుభ్రం చేయాలి. గడ్డిని తొలగించాలి. లేదంటే గట్ల వెంట మిగిలి ఉండే లార్వా ద్వారా పంటకు మొగి పురుగు వ్యాపించే అవకాశాలుంటాయి. నారు పోశాక పది రోజులకు 3 జీ గుళికలు వేసుకోవాలి. విషపూరితమైన మందులు వేయవద్దు. పిలకలు రావాలంటే భాస్వరం వేయాలి. రెండో పంట కింద పప్పు దినుసులు సాగు చేసుకోవడం వల్ల భూసారం పెరుగుతుంది.

**ప్రశ్న:** సోయా, పత్తి పంటను ఎప్పుడు వేయాలి?

– మల్లికార్జున్ యాదవ్, పెద్దకొడప్‌గల్

**డీఏవో:** వర్షాలు కురిసి భూమి తగినంతంగా తడిసిన తర్వాతే విత్తనాలు వేసుకోవాలి. ఈసారి త్వరగానే రుతుపవనాలు వస్తాయి. సెప్టెంబర్ వరకు మంచి వర్షాలు పడే అవకాశాలున్నాయి. లోతు దుక్కులతో మంచి ఫలితాలు ఉంటాయి. గతేడాది సోయాబీన్‌లో పసుపురంగు మోజా వైరస్ ఎక్కువగా కనిపించింది. విత్తనాల ఎంపికలో స్థానిక వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకోవాలి.

**ప్రశ్న:** అధిక సాంద్రత పద్ధతిలో 25 ఎకరాల్లో పత్తి సాగు చేయాలని అనుకుంటున్నా. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకం అందుతుందా?

– పాటిల్ నీలకంత, దోంగ్లీ

**డీఏవో :** గతేడాది రాష్ట్రంలోని 16 జిల్లాలలో ప్రయోగాత్మకంగా అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేసే రైతులకు ఎకరానికి రూ. 4 వేల చొప్పున ప్రోత్సాహకం అందించారు. అందులో మన జిల్లా లేదు. ఈసారి కూడా 28 వేల ఎకరాల్లో మన జిల్లాలో పత్తి సాగు జరుగనుంది. పత్తిసాగు తక్కువగా ఉన్నందున ఈసారి కూడా మన జిల్లాకు ప్రోత్సాహక జాబితాలో చోటు దక్కలేదు. కాకపోతే అధిక సాంద్రత పద్ధతిలో పత్తిసాగు చేయాలన్న మీ నిర్ణయం ఎంతో మంచిది. ప్రైవేట్ కంపెనీలను సంప్రదిస్తే వారేమైనా ప్రోత్సహించే అవకాశం ఉంటుంది. కాటన్ పికింగ్ యంత్రాలపై సబ్సిడీలాంటివి ప్రస్తుతం లేవు.

**ప్రశ్న:** పెసర్లు, మినుములు ఇప్పుడు వేసుకోవచ్చా? భూసార పరీక్షలు ఎందుకు చేయడం లేదు?

– గణపతి, సలాబ్ తండా, పెద్దకొడప్‌గల్

**డీఏవో:** ఇది సరైన సమయం కాదు. వర్షాలకు ఈ పంట తట్టుకోదు. వర్షాలు ఎక్కువగా కురిస్తే పంట నష్టపోయే అవకాశం ఉంటుంది. భారీ వర్షాలు అయిపోయాక ఆగస్టు నుంచి వేసుకుంటే మంచిది. నాలుగేళ్ల నుంచి భూసార పరీక్షలు చేయడం లేరు. మన జిల్లాలో పరీక్ష కేంద్రం లేదు. నిజామాబాద్‌లో ఉన్న కేంద్రానికి పంపాల్సి వస్తుంది. అందుకే పరీక్షలు తగ్గాయి.

**ప్రశ్న:** డిమాండ్ ఉన్న డీఏపీ, ఇతర ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నారు. దుకాణాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

– నాగరాజుగౌడ్, మాందాపూర్, బీబీపేట్

**డీఏవో:** డీఏపీ బస్తా ధర రూ.1450. ఎమ్మార్పీకే కొనుగోలు చేయాలి. తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలి. డీఏపీ గాని, ఏ ఇతర ఎరువుల తయారీ అయినా ఒకే విధంగా ఉంటుంది. ఏ కంపెనీ ఎరువులు వాడినా ఒకే రకమైన ఫలితాలు ఉంటాయి. రైతులు ఈ విషయంలో ఎలాంటి సందేహాలు పెట్టుకోవద్దు. ఎమ్మార్పీకంటే అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే దుకాణాల లైసెన్స్‌ను రద్దు చేస్తాం. నకిలీ విత్తనాలను అరికట్టడానికి టాస్క్‌ఫోర్స్ బృందాలు పని చేస్తున్నాయి. ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

**ప్రశ్న:** ఈసారి వరికి బదులుగా కూరగాయలు సాగు చేయాలని అనుకుంటున్నాం. ప్రోత్సాహకాలు ఏమైనా ఉన్నాయా?

– యాదగిరి, తిమ్మక్‌పల్లి, కామారెడ్డి

**డీఏవో :** పంట మార్పిడి చేయడం మంచి విషయం. దీర్ఘకాలిక పందిరి కూరగాయలు వేస్తే మంచి ఫలితాలు వస్తాయి. టమాటను స్టేకింగ్ పద్ధతిలో వేసుకోవాలి. ఎస్సీ కార్పొరేషన్, హార్టికల్చర్ శాఖల ద్వారా సబ్సిడీలు, ప్రోత్సాహకాలు అందుతున్నాయి. ఆయా కార్యాలయాల్లో సంప్రదిస్తే సమాచారం ఇస్తారు.

### నమోదు చేయించుకుంటేనే బీమా

ఏటా ఆగస్టులో రైతు బీమా పథకం కింద అర్హులైన రైతులను నమోదు చేసే ప్రక్రియ ఉంటుంది. రైతులు వ్యవసాయ అధికారులను సంప్రదించి పాస్‌బుక్, ఆధార్‌కార్డు, నామినీ, బ్యాంక్ ఖాతా వివరాలను సమర్పిస్తే పథకంలో పేర్లు నమోదు చేస్తారు. నమోదు చేయించుకోని వారికి రైతు బీమా వర్తించదు.

## క్లుప్తంగా

### గ్లోబల్ రైస్ సమ్మిట్‌లో జైతాపూర్ రైతు



**ఎడపల్లి:** హైదరాబాద్‌లో నిర్వహించిన గ్లోబల్ రైస్ సమ్మిట్‌లో మండలంలోని జైతాపూర్ గ్రామానికి చెందిన రైతు పాపారావు శనివారం పాల్గొన్నారు. ఈ సమ్మిట్‌లో సేంద్రియ వ్యవసాయంపై వివరించారు. పాపారావు ఇప్పటికే జైతాపూర్‌లో 5 ఎకరాలలో పంట సాగు చేస్తున్నారు. సేంద్రియ వ్యవసాయంతో తాను సాగు చేస్తున్న వరి పంట విధానాన్ని వివరించారు. అనంతరం నిర్వాహకులు పాపారావు అభినందించారు.

### గురుకుల కాలేజీలో పోస్టుల భర్తీ

**నిజామాబాద్ అర్బన్:** నగరంలోని మైనారిటీ గురుకుల బాలికల కళాశాలలో ఔట్ సోర్సింగ్ విధానంలో జూనియర్ లెక్చరర్ పోస్టులు భర్తీ చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజశ్రీ ఒక ప్రకటన తెలిపారు. గణితం, రసాయన శాస్త్రం, జంతు శాస్త్రం, ఇంగ్లిష్ బోధించడానికి ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 12వ తేదీలో పు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పీజీ, డిగ్రీ బీఎడ్ చేసిన వారు అర్హులని తెలిపారు.వివరాలకు 83286 18748 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

### ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**నిజామాబాద్ అర్బన్:** నగరంలోని మైనారిటీ బాలికల, బాలుర పాఠశాల/కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్స్ రాజశ్రీ, బషిరుద్దీన్ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. బాలుర పాఠశాలలలో ఐదో తరగతిలో 8 సీట్లు, ఏడో తరగతిలో 12 సీట్లు, ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీ, బైపీసీలో 23 సీట్లు ఖాళీగా ఉన్నాయని వివరించారు. బాలికల పాఠశాలలో కూడా మిగిలిన సీట్లను భర్తీ చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

**దరఖాస్తుల ఆహ్వానం**

**ఆర్మూర్‌టౌన్:** మామిడిపల్లిలో ఉన్న మైనార్టీ బాలికల రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో జువాలజీ సబ్జెక్టు బోధించేందుకు ఔట్ సోర్సింగ్ పోస్టుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నహీదా ఫిర్దౌజ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 10వ తేదీలోగా కళాశాలలో దరఖాస్తులను సమర్పించాలని కోరారు.

### మరింత పెరిగిన టమాట ధర



**బాల్కొండ:** టమాట ధర మరింత పెరిగింది. వారం రోజుల క్రితం నుంచి 25 కిలోల బాక్సు ధర రూ. 400 ఉండగా రెండు రోజుల నుంచి రూ. 600కు పెరిగింది. దీంతో టమాట రైతుకు స్వల్ప ఊరట లభించింది. టమాట పంట ప్రస్తుతం చివరి దశలో ఉందని.. ఇప్పటికైనా మంచి ధర దక్కుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మదనపల్లిలో టమాట బాక్సు ధర రూ. వెయ్యి పలుకుతుండగా.. మన ప్రాంతంలో మాత్రం రూ. 600 మాత్రమే పలుకుతోందని రైతులు చెబుతున్నారు. మన ప్రాంతంలో సాగు చేస్తున్న టమాట అంత నాణ్యత ఉండదని అందుకే తక్కువ ధర లభిస్తోందని వ్యాపారులు చెబుతున్నారు. అంతే కాకుండా టమాట సైజ్‌లో కూడా తేడా ఉంటుందని పేర్కొంటున్నారు.

# సరిహద్దు కేంద్రంగా రేషన్ దందా!

- జిల్లా సరిహద్దులోని కొడిచర్లలో భారీగా పీడీఎస్ బియ్యం పట్టివేత
- పేదల బియ్యంపై పెద్దల కన్ను
- పీడీ యాక్ట్ నమోదు చేసినా వెనక్కి తగ్గని వ్యాపారులు



కొడిచర్ల శివారులో పీడీఎస్ బియ్యం లభ్యమైన రైస్‌మిల్

**బాల్కొండ:** రేషన్ బియ్యాన్ని వేరే రాష్ట్రాలకు తరలించేందుకు వీలుగా బియ్యం వ్యాపారులు జిల్లా సరిహద్దు ప్రాంతాలను కేంద్రంగా చేసుకుని తమ దందాను యథేచ్ఛగా సాగిస్తున్నారు. గత పది రోజుల క్రితం మెండోరా మండలం కొడిచర్ల గ్రామ శివారులోని ఓ రైస్ మిల్లుపై టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడి చేయగా 130 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుబడ్డాయి. అంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. రైస్ మిల్లునే అడ్డగా చేసుకుని ఎవరికీ అనుమానం రాకుండా దందాను గత కొన్నాళ్లుగా సాగిస్తున్నట్లు తెలుస్తోంది.

**పల్లెల్లో కొనుగోలు చేసి..**

రేషన్ బియ్యాన్ని పల్లెల్లో కొనుగోలు చేసి మోపెడ్ వాహనాలపై తరలిస్తూ ఓ చోట నిల్వ చేస్తున్నారు. పల్లెల్లో కిలోకు రూ.18కి ఎచిన్న వ్యాపారులు కొనుగోలు చేసి రూ.21కి బడా వ్యాపారులకు అమ్ముతున్నారు. అనంతరం బడా వ్యాపారులు బియ్యాన్ని వాహనాల్లో లోడ్ చేసి మహారాష్ట్ర ప్రాంతానికి తరలిస్తున్నారు. ఇందుకోసం సులభంగా ఉంటే నిజామాబాద్, నిర్మల్ జిల్లాల సరిహద్దు ప్రాంతాన్ని అడ్డాగా చేసుకున్నారు. రెండు జిల్లాల మధ్య గోదావరి మాత్రమే అడ్డుగా ఉంది. దీంతో గోదావరి అంచున ఉన్న కొడిచర్ల గ్రామాన్ని ఎంచుకుని అక్కడ బియ్యం నిల్వ చేయడం ప్రారంభించారు.

**గతంలో పలు కేసులు**

రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఇతరప్రాంతాలకు తరలిస్తున్న పలువురిపై గతంలో కేసులు నమోదయ్యాయి. కొందరిపై పీడీ యాక్టు సైతం నమోదు చేసినప్పటికీ దందాను మాత్రం ఆపలేదు. గతంలో బాల్కొండ మండల కేంద్రంతోపాటు మెండోరా మండలం బుస్సాపూర్‌ను కేంద్రంగా రేషన్ దందాను కొనసాగించారు. ఓ వైపు కేసులు నమోదవుతున్నా మరోవైపు బియ్యం అక్రమ దందా కొనసాగుతూనే ఉండంతో అధికారుల కనుసన్నల్లోనే ఇదంతా జరుగుతోందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి గత పది రోజుల క్రితం పట్టుబడిన బియ్యంపై పూర్తి విచారణ చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

**బాల్కొండ మండల కేంద్రంలో..**

బాల్కొండ మండల కేంద్రంలోని ఓ కిరాణాదుకాణంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం దాడిచేసి 19 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. బాల్కొండ మండల కేంద్రంలో రేషన్ బియ్యం దందా జోరందుకుందనేందుకు ఈ ఘటనే నిదర్శనమనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. రేషన్ పంపిణీ చేసిన నెలలో మొదటి పదిరోజులపాటు దాడులు చేస్తే అధికారులకు రేషన్ బియ్యం కుప్పలుగా పట్టుబడుతుందని పలువురు అంటున్నారు.

> **చర్యలు తీసుకుంటున్నాం**
>
> రేషన్ బియ్యం తరలించే వారిపై చర్యలు తీసుకుంటున్నాం. పీడీఎస్ బియ్యం నిల్వలు ఉన్నట్లు సమాచారం అందితే వెంటనే చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడైనా రేషన్ బియ్యం నిల్వ చేసినట్లు తెలిస్తే వెంటనే మాకు సమాచారం అందించాలి.
>
> – శ్రీనివాస్, డీటీ ఎన్‌ఫోర్స్‌మెంట్, నిజామాబాద్

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

**వేల్పూర్:** మండలంలోని సాహెబ్‌పేట్ గ్రామ ప్రైమరీ స్కూల్‌లో 2003–04 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి చదివిన వి ద్యార్థులు శనివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఆటపాటలో ఉల్లాసంగా గడిపి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు బోధించిన గురువులు జంగం అశోక్, మాణిక్యం, శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు.

### నేడు రగ్బీ జూనియర్స్ ఎంపికలు

**మోపాల్(నిజామాబాద్‌రూరల్):** మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి రగ్బీ జూనియర్స్ ఎంపికలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు రెంజర్ల నరేశ్, కార్యదర్శి అబ్బయ్య, ఉపాధ్యక్షుడు రాజ్ గణేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఎంపికలకు హాజరుకావాలని కోరారు. 2006 నుంచి 2008 సంవత్సరాల్లో జన్మించిన వారు అర్హులని, ఎంపికైన క్రీడాకారులకు ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు హైదరాబాద్‌లోని జింఖానా మైదానంలో నిర్వహించనున్న టోర్నీలో పాల్గొనే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

## భుజం తాకిందని కత్తితో దాడి



కత్తి దాడిలో గాయపడిన గంగాధర్

**బోధన్‌టౌన్(బోధన్):** భుజం తాకిందని ఆగ్రహంతో ఓ వ్యక్తి మరో వ్యక్తిపై కత్తితో దాడి చేసిన ఘటన బోధన్ పట్టణంలో కలకలం రేపింది. పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో ఉన్న కల్లుబట్టి వద్ద శనివారం మధ్యాహ్నం జరిగిన ఘటనకు సంబంధించి పట్టణ సీఐ వీరయ్య, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పాతబస్టాండ్ సమీపంలోని కల్లుబట్టీకి జీవన్‌సింగ్, గంగాధర్ వెళ్లారు. ఒకరు కల్లు తాగి బయటకు వస్తుండగా, మరొకరు కల్లు తాగేందుకు లోనికి వెళ్తుండగా, ఒకరి భుజాలు మరొకరికి తగిలాయి. ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా కోపోద్రిక్తుడైన జీవన్‌సింగ్ తన వద్ద ఉన్న కత్తితో గంగాధర్ మెడపై దాడి చేశాడు. గంగాధర్‌కు గాయాలుకావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు బాధితుడిని పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గంగాధర్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### భార్య తరఫు బంధువులపై..

**ఖలీల్‌వాడి:** భార్య తరపు బంధువులపై భర్త దాడి చేసిన ఘటన నగరంలోని ఆరో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తాజ్ దాబా వద్ద చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. బోధన్ నియోజకవర్గంలోని ఫతేపూర్ గ్రామానికి చెందిన సభాబేగంకు నగరంలోని ఆటో నగర్ ప్రాంతానికి చెందిన సయ్యద్‌అలీతో ఐదేళ్ల క్రితం వివాహం కాగా, ఒక బాబు, పాప ఉన్నారు. భార్యాభర్తల మధ్య విభేదాలు రావడంతో ఇప్పటికే పెద్దమనుషుల సమక్షంలో నాలుగు సార్లు పంచాయితీ జరిగింది. తొమ్మిది నెలల క్రితం మళ్లీ గొడవపడడంతో సభాబేగం తన తల్లిదండ్రుల వద్దకు వెళ్లిపోయింది. శనివారం మళ్లీ పెద్ద మనుషులు పంచాయితీ నిర్వహించి భార్యాభర్తలను కలిపారు. ఈ క్రమంలో మాటమాట పెరగడంతో మనసులో పెట్టుకున్న సయ్యద్ అలీ ఫతేపూర్ వెళ్తున్న వారిపై తాజ్ దాబా వద్ద కర్రలతో దాడి చేశాడు. ఈ ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### భూ వివాదంపై ఫిర్యాదు



దాడిలో గాయపడిన చిన్న భూమన్న

**జక్రాన్‌పల్లి:** మండలంలోని కేశ్‌పల్లికి చెందిన తడ్పాకల చిన్న భూమన్న భూ వివాదంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేశ్‌పల్లి గ్రామ రెవెన్యూ శివారులోని భూమి విషయంలో భూమన్నకు బాజాగౌడ్ అనే వ్యక్తితో కొంతకాలంగా వివాదం నెలకొంది. అధికారుల సర్వే తరువాత 1146 సర్వే నంబర్‌లోని భూమి పూర్తిగా తనదేనని తేలిందని భూమన్న ఫిర్యాదులో పేర్కొన్నాడు. భూమిని తమకు తెలియకుండా బాజాగౌడ్ దున్ని పంట సాగు చేశాడని, పంట ఎందుకు వేశావని అడిగితే కౌలు చెల్లిస్తానని చెప్పి ఇప్పటి వరకు చెల్లించలేదని తెలిపాడు. కౌలు డబ్బులు ఇవ్వాలని అడిగినందుకు తనపై బాజాగౌడ్ దాడి చేశాడని భూమన్న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై ఎస్సై తిరుపతిని వివరణ కోరగా.. ఫిర్యాదు అందిందని విచారణ కొనసాగుతోందని తెలిపారు.

## క్రైం కార్నర్

### అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



శాకటి ప్రేమ్‌కుమార్ (ఫైల్)

**డిచ్‌పల్లి:** మండలంలోని ధర్మారం(బి) గ్రామ ఎంపీటీసీ శాకటి రాజమణి, మురళి దంపతుల కుమారుడు ప్రేమ్‌కుమార్ (32) శుక్రవారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు డిచ్‌పల్లి ఎస్సై యూ.మహేశ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. బయటకు వెళ్లి వస్తానని చెప్పి ప్రేమ్‌కుమార్ శుక్రవారం సాయంత్రం ఇంట్లో నుంచి వెళ్లాడు. రాత్రి 10 గంటలు దాటినా ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళనకు గురై అతడి ఆచూకీ కోసం వెతుకగా అర్ధరాత్రి సమయంలో గొల్లపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఉన్న ఎంఎస్ఆర్ బార్ పక్కన చెట్టు కింద చనిపోయి కనిపించాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని ప్రేమ్‌కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి శాకటి మురళి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. అయితే ప్రేమ్‌కుమార్ రాత్రి చెట్టుకింద కూర్చుని మద్యం సేవిస్తుండగా పిడుగుపాటుకు గురై మృతిచెంది ఉంటాడని వైద్యులు అనుమానాలు వ్యక్తం చేశారు. పోస్టుమార్టం రిపోర్టు వచ్చిన తరువాతే స్పష్టత వస్తుందని ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య ప్రేమలత, ఒక పాప ఉన్నారు.

### చేపలు పట్టేందుకు వెళ్లి..



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

**భిక్కనూరు:** మండలంలోని బస్వాపూర్ గ్రామంలోని పటేల్ చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి ఒకరు మృతి చెందినట్లు ఎస్సై సాయికుమార్ శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన గంగాధారి స్వామి (46) పటేల్ చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. అయితే, చేపల కోసం విసిరిన వల ప్రమాదవశాత్తు స్వామి కాళ్లకు చుట్టుకోవడంతో నీట మునిగి మృతి చెందాడు. మృతుడి భార్య సుధారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### బాలుడిపై కుక్కలదాడి



గాయాలపాలైన ధీరజ్

**జక్రాన్‌పల్లి:** మండలంలోని చాంద్‌మియాబాగ్ తండాలో ధీరజ్(5) అనే బాలుడిపై కుక్కలు శనివారం దాడి చేశాయి. తండాకు చెందిన బానోత్ ధీరేందర్, రజిత దంపతుల కుమారుడైన ధీరజ్ తన పెద్దనాన్న ధారాసింగ్ ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా రెండు కుక్కలు దాడి చేశాయి. ధీరజ్ తల నుంచి తీవ్రరక్తస్రావం కావడంతో స్థానికులు వెంటనే జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

### కరెంటు షాక్‌తో గేదె మృతి

**గాంధారి(ఎల్లారెడ్డి):** మండలంలోని తిమ్మాపూర్‌లో శనివారం సాయంత్రం విద్యుత్ షాక్‌తో గేదె మృతి చెందింది. కాయితి సావిత్రికి చెందిన గేదె మేతకు వెళ్లి సాయంత్రం వేళ తిరిగి వస్తుండగా రోడ్డు సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షాక్‌కు గురై మృతి చెందింది. మృతి చెందిన గేదె విలువ సుమారు రూ.50వేలు ఉంటుందని మహిళా రైతు సావిత్రి తెలిపారు. ఘటనా స్థలాన్ని విద్యుత్‌శాఖ లైన్‌మెన్ కొండల్‌రెడ్డి పరిశీలించి విద్యుత్‌సరఫరాను నిలిపివేశారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను దూరంగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



# యువకుడి హత్యతో ఉద్రిక్తత



నిందితుడి ఇంటికి నిప్పు పెడుతున్న మృతుడి కుటుంబీకులు, బంధువులు

- మృతుడి బంధువుల ఆగ్రహం, నిందితుడి ఇంటికి నిప్పు
- డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన



లకావత్ వెంగల్ (ఫైల్)

**డిచ్‌పల్లి/ఇందల్వాయి:** డిచ్‌పల్లి మండలం సీఎంసీ కళాశాల సమీపంలో ఒకరి హత్య తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. వివరాలిలా ఉన్నాయి. ఇందల్వాయి మండలం మెగ్యానాయక్ తండాకు చెందిన లకావత్ వెంగళ్(36) గురువారం ఉదయం 10 గంటలకు ఇంట్లోనుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబీకులు అదే రోజు ఫిర్యాదు చేయగా ఇందల్వాయి పోలీసులు విచారణ చేపట్టారు. అయితే శుక్రవారం రాత్రి డిచ్‌పల్లి సీఎంసీ సమీపంలోని చెట్ల పొదల్లో వెంగళ్ మృతదేహం లభించింది. సమీపంలోని వైన్స్ షాపు వద్ద ఉన్న సీసీ టీవీ పుటేజీని పరిశీలించిన పోలీసులు వెంగళ్ మెగ్యానాయక్ తండాకు చెందిన బిక్యాతో కలిసి మద్యం కొనుగోలు చేసినట్లు గుర్తించారు. ఇద్దరు కలిసి మద్యం సేవించి ఉంటారని, గొడవ జరిగి వెంగళ్ హత్యకు గురై ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. వెంగళ్‌ను హతమార్చి చెట్టుకు ఉరివేసి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడు. పోలీసులకు అనుమానం రావడంతో శనివారం ఉదయం నిందితుడు బిక్యాను అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో తానే వెంగళ్‌ను హత్య చేశానని బిక్యా అంగీకరించినట్లు సమాచారం. ఇద్దరి మధ్య మూడెకరాల భూమి విషయంలో కొద్దిరోజులుగా తగాదా నడుస్తున్నట్లు తెలిసింది. విషయం తెలియగానే మృతుడి కుటుంబీకులు, బంధువులు బిక్యా ఇంటిపై దాడి చేసి నిప్పటించారు. ఇంట్లోని సామగ్రిని బయటపడేసి నిప్పుపెట్టారు. అడ్డువచ్చిన పోలీసులను నెట్టివేశారు. మంటలు ఇంటికి అంటుకోవడంతో చివరకు ఫైరింజన్ వచ్చి మంటలను ఆర్పివేసింది. అనంతరం మృతుడి కుటుంబీకులు, బంధువులు, తండావాసులు పెద్ద సంఖ్య లో డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఆందోళన చేపట్టారు. వెంగళ్ హత్యలో బిక్యాకు సహకరించిన వారందరినీ పట్టుకుని శిక్షించాలని డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకు మృతదేహానికి అంత్యక్రియలు చేసేది లేదని స్పష్టం చేశారు. డిచ్‌పల్లి సీఐ మల్లేశ్, ఎస్సై మహేశ్ ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు డిచ్‌పల్లికి చేరుకున్నారు. తండా పెద్దలతో మాట్లాడి మృతుడి బంధువులను సముదాయించారు. నిందితులకు శిక్షపడేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో తండావాసులు ఆందోళన విరమించారు. శనివారం రాత్రి వెంగళ్ అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడి భార్య అనిత ఫిర్యాదు మేరకు డిచ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఆందోళన చేస్తున్న బంధువులు

# చదువుతోపాటు ఆటలూ ముఖ్యమే..




చిన్నారుల కళా ప్రదర్శన



చిన్నారులతో కామారెడ్డి ఎస్పీ సింధుశర్మ

**కామారెడ్డి క్రైం:** పిల్లలకు చదువుతోపాటు ఆటలూ ముఖ్యమేనని ఎస్పీ సింధుశర్మ అన్నారు. వేసవి సెలవుల సందర్భంగా జిల్లా కేంద్రంలోని శిశు మందిర్‌లో జిల్లా పోలీసుశాఖ సిబ్బంది పిల్లల కోసం నిర్వహించిన సమ్మర్ క్యాంప్ శనివారం ముగిసింది. ఎస్పీ సింధుశర్మ ముగింపు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. రెండు వారాలపాటు కొనసాగిన సమ్మర్ క్యాంప్‌లో సుశిక్షితులైన టీచర్లను, కోచ్‌లతో పిల్లలకు డ్రాయింగ్, పెయింటింగ్, డ్యాన్స్, పాటలు, కరాటే వంటి కళల్లో శిక్షణ ఇప్పించినట్లు తెలిపారు. ఆటలతో మానసిక ఉల్లాసం కలగడంతోపాటు ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. పిల్లలకు శిక్షణ ఇచ్చిన వంశీ ప్రసాద్‌గౌడ్, నవ్యశ్రీ, సంజుకుమార్, అనిల్ కుమార్, నవీన్‌కుమార్‌ను ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో ఏఎస్పీ నరసింహారెడ్డి, పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్‌బీ సీఐ తిరుపయ్య, విద్యార్థులు, వారితల్లిదండ్రులు పాల్గొన్నారు.

## దుబాయిలో పెద్దవాల్గోట్‌వాసి ఆత్మహత్య



శేఖర్ (ఫైల్)

**సిరికొండ:** ఉపాధి నిమిత్తం దుబాయికి వెళ్లిన మండలంలోని పెద్దవాల్గోట్ గ్రామానికి చెందిన వ్యక్తి అక్కడే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం గ్రామానికి మృతదేహం చేరుకోగా అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పెద్దవాల్గోట్‌కు చెందిన గజనబోయిన శేఖర్(45) ఉపాధి నిమిత్తం ఇరవై ఏళ్లుగా దుబాయికి వెళ్తున్నాడు. అక్కడ డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్న శేఖర్ తాను పనిచేసే కార్యాలయంలోనే ఎవరూ లేనిసమయంలో గత నెల 30వ తేదీన ఆత్మహత్య చేసుకున్నాడు. పది రోజుల తరువాత శేఖర్ మృతదేహం శనివారం స్వగ్రామానికి చేరగా, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు అంత్యక్రియలు పూర్తి చేశారు. మృతుడికి తల్లిదండ్రులతోపాటు భార్య హేమలత, కూతురు, ఇద్దరు కొడుకులు ఉన్నారు. వేతనం, పని బాగానే ఉన్నప్పటికీ శేఖర్ ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడో తెలియడం లేదని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

**హైదరాబాద్‌లో గుజ్జుల్‌తండా వాసి..**



సంజు (ఫైల్)

**గాంధారి(ఎల్లారెడ్డి):** మండల పరిధిలోని గుజ్జుల్‌తండాకు చెందిన సంజు(22) హైదరాబాద్‌లో శనివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తండావాసులు తెలిపా రు. సంజుకు ఏడాది క్రితం పెళ్లి కాగా, బతుకుదెరువు కోసం హైదరాబాద్ వెళ్లి ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తూ జీవిస్తున్నాడు. కుటుంబ కలహాల కారణంగా తాను నివాసం ఉంటున్న గదిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని తండావాసులు తెలిపారు. సంజు భార్య పనికి వెళ్లిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకుందన్నారు.

## బొల్లారం గ్రామానికి చెందిన యువకుడు..



**నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి):** మండలంలోని బొల్లారం గ్రామానికి చెందిన కోరబోయిన హరీశ్(24)అనే యువకుడు శుక్రవారంరాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. హరీశ్ ఆరునెలల క్రితం అదే గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్న భార్యాభర్తలు కల్యాణలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు నాలుగు రోజుల క్రితం గ్రామానికి వచ్చారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి గ్రామశివారులో ఉన్న తన వ్యవసాయభూమిలోని చెట్టుకు హరీశ్ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తమ కూతురుని బాగా చూసుకోవాలని హరీశ్‌కు అతడి భార్య తరపు వారు తరచూ చెబుతుండడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడని అతడి తండ్రి కొరబోయిన నాగయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.